ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 15 జూలై 2025



ఏపీపీఎస్సీ పరీక్షలను పక్కాగా నిర్వహించాలి

విజయనగరం కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లెక్చరర్ ఉద్యోగాల పరీక్షలను పక్కాగా నిర్వహించాలని విజయనగరం జేసీ సేతుమాధవన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి 23 వరకూ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజాం జీఎంఆర్ కాలేజీ, జొన్నాడ లెండి కాలేజీ, గాజులరేగ ఆయాన్ డిజిటల్ జోన్, చింతవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆన్‌లైన్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్నెట్, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు.

శివారుకు అందేనా?

- తోటపల్లి పాత రెగ్యులేటర్ నుంచి ఖరీఫ్‌కు సాగునీరు
- రేపు విడుదల చేసేందుకు సన్నాహాలు
- అధ్వానంగా కాలువలు
- ప్రభుత్వ చొరవతో పూడికతీత పనులు పూర్తి
- గత వైసీపీ సర్కారు తీరుతో ఆధునికీకరణకు నోచని వైనం
- వేధిస్తున్న లస్కర్ల కొరత.. ఇతరత్రా సమస్యలు
- ఆందోళనలో రైతులు

గరుగుబిల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని ఎడమ ప్రధాన , కుడి ఉప కాలువల నుంచి ఈనెల 16న సాగునీరు విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఖరీఫ్ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నారు. ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే రెగ్యులేటర్ పరిధిలోని కాలువలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు చేపట్టారు. కాగా గత వైసీపీ ప్రభుత్వ తీరుతో ఆధునికీకరణ పనులేవీ పూర్తికాలేదు. నిర్వహణ లోపం కారణంగా వాటి పరిధిలో డ్రాపులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎడమ ప్రధాన కాలువ ప్రారంభంలోనే సమస్యలు నెలకొన్నాయి. దీంతో పాటు రెగ్యులేటర్ కూడా మొరాయిస్తుంది. గతంలో రెండు కాలువల పరిధిలో అధికంగా గండ్లు పడ్డాయి. శివారు ప్రాంతాలకు సాగునీరు అందని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సక్రమంగా నీరందుతుందా? లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి..

- తోటపల్లి పాత రెగ్యులేటర్ నుంచి గరుగుబిల్లి, జియ్యమ్మవలస, వీరఘట్టం, పాలకొండ, బలిజిపేట, విజయనగరం జిల్లాలో వంగర, సంతకవిటి, శ్రీకాకుళం జిల్లా పరిధి బూర్జ మండలాల్లో సుమారు 63,549 ఎకరాలకు ఈ ఖరీఫ్‌లో సాగునీరందించాల్సి ఉంది. ఎడమ ప్రధాన కాలువ పరిధిలో సుమారు 81 గ్రామాలు, 31,310 ఎకరాలు , కుడి ఉప కాలువ పరిధిలో 28 గ్రామాలకు సంబంధించి 9,128 ఎకరాలున్నాయి. ఎడమ వైపు 26కు పైగా ఉన్న ఓపెన్ హెడ్ చానల్ నుంచి 12,450 ఎకరాలు, కుడి వైపునకు సంబంధించి 2,160 ఎకరాలు ఉన్నాయి. అదనపు ఆయకట్టు 8,500 ఎకరాలు ఉన్నాయి.
- పాత రెగ్యులేటర్ పరిధిలో నిర్మాణాలు గత బ్రిటీష్ హయాంలో చేపట్టినవే. వాటి దుస్థితిని తెలుసుకున్న అప్పటి టీడీపీ ప్రభుత్వం 2018లో ఆధునికీకరణకు సుమారు రూ.93 కోట్లు మంజూరు చేసింది. 2019 వరకు 23 శాతం మేర పనులు నిర్వహించారు. ఆ తర్వాత అధికారం లోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. బిల్లులు చెల్లించక పోడంతో పనులు నిలిచిపోయాయి.

పనులు ఇలా...

ఎడమ కాలువ పరిధిలో 37.62 కిలో మీటర్లకు గాను 16 కిలో మీటర్లు, కుడి కాలువ పరిధిలో 17.616 కిలో మీటర్లకు గాను 9.37 కిలో మీటర్ల మేర లైనింగ్ పనులు నిర్వహించారు. ఎడమ కాలువ పరిధిలో 8 బ్రాంచ్‌లు,

(మిగతా 6వ పేజీలో...)



కెల్ల సమీపంలోని ఎడమ కాలువ మధ్యలో ఇసుక బస్తాలు వేసిన దృశ్యం



కేఆర్ఎన్ వలసలో ఎండుతున్న వరి ఎదలు

నారుకు నీరేదీ?

- ముఖం చాటేసిన వరుణుడు
- వేసవిని తలపిస్తున్న ఎండలు
- ఎండుతున్న వరి నారుమడులు
- కాపాడుకునేందుకు రైతుల అవస్థలు

గరుగుబిల్లి/వీరఘట్టం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ రైతులకు ప్రకృతి సహకరించడం లేదు. కొద్దిరోజులుగా వర్షాలు కుర వడం లేదు. వరుణుడు పూర్తిగా ముఖం చాటేశాడు. మరోవైపు వేసవిని తలపించేలా ఎండలు.. ప్రాజెక్టుల నుంచి కూడా పూర్తి స్థాయిలో సాగు నీరు అందక పోవడంతో వరి నారుమడులు ఎండిపోతున్నాయి. దీంతో రైతన్నలు వాటిని కాపాడు కునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. గరుగుబిల్లి మండలం లోని పలు గ్రామాల్లో రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం బీవీ పురం, గరుగుబిల్లి, పెద్దూరు, గొట్టివలస, హిక్కిం వలస, ఉద్దవోలు, దళాయి వలస, ఉల్లిభద్ర, కేఆర్ఎన్ వలస గ్రామాల్లో ఎండుతున్న వరి ఎదలను పరిరక్షించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. జంఝావతి నుంచి మండలంలో సుమారు 5 వేల ఎకరా లకు సాగునీరందించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు శూన్యం. మండలంలో తోటపల్లి ప్రాజెక్టు ఉన్నా ఈ ప్రాంతాలకు నీరందని పరిస్థితి. కొద్ది రోజుల్లో

(మిగతా 6వ పేజీలో...)




ప్రోత్సహిస్తే
గిరిజన కళకళ!

- ఏజెన్సీలో ఎంతోమంది కళాకారులు
- అయినా తగిన గుర్తింపునకు నోచని వైనం
- ప్రభుత్వం స్పందించాలని విన్నపం

4లో

రాజకీయాలకు దూరం అయినా..
అభివృద్ధికి సూచనలు ఇస్తా

- తెలుగు వారి గౌరవం మరింత ఇనుమడింప చేస్తా
- అవకాశం కోసం పరుగెత్తలేదు.. వస్తే న్యాయం చేశా
- విలేకరులతో పూసపాటి అశోక్ గజపతిరాజు



విజయనగరం/రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): గవర్నర్ పదవి రాజ్యాంగబద్ధమైనదని, ఈ కారణంగా రాజకీయాలకు దూరంగా ఉంటాను కానీ విజయనగరం, ఆంధ్రప్రదేశ్, దేశాభివృద్ధికి సలహాలు, సూచనలు ఇస్తూనే ఉంటానని గోవా గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు చెప్పారు. విజయనగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగువారికి అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని, ఆ గౌరవాన్ని మరింత ఇనుపడింప చేసేలా గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహిస్తానన్నారు. రాజకీయాల్లో అవకాశం కోసం తానెప్పుడూ పరుగెత్తలేదని, అవకాశం వస్తే తగిన న్యాయం చేస్తూ ముందుకు సాగుతున్నానన్నారు. బంగ్లా తనకు అలవాటు అయిందని, కొత్త అసైన్‌మెంట్ వచ్చినప్పుడు అక్కడికి వెళ్లడం, పూర్తయిన తరువాత బంగ్లాకి రావడం జరుగుతుందన్నారు. తిరిగి అసైన్‌మెంట్ ఇస్తే అక్కడికి కూడా వెళ్తానన్నారు. ఈ ప్రాంతాన్ని మరువలేనని, ఇక్కడి ప్రజలకు ఏ స్థాయిలో ఉన్నా సేవలు అందిస్తూ ఉంటానన్నారు. తనకి గవర్నర్‌గా నియమించిన ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. సుదీర్ఘకాలం పాటు రాజకీయాల్లో కొనసాగానని, గవర్నర్‌గా నియమితులైన తనకు వెన్నంటి ఉండి సహకరించిన సతీమణి సునీలా గజపతిరాజు సహాయ, సహకారాలు మరువలేని వన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకుడు ఐవీపీ రాజు పాల్గొన్నారు. ● గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్ గజపతిరాజుకు సోమవారం సాయంత్రం పైడిమాంబ దేవస్థానం పురోహితులు ఆశీర్వచనం అందించారు. మరోవైపు అశోక్ బంగ్లా టీడీపీ, ఆయన అభిమానులు, కార్యకర్తలతో సోమవారం సందడిగా కనిపించింది. ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు వచ్చి కలిశారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అందుబాటులో లేనందున ఫోన్‌చేసి అశోక్ గజపతిరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

భానుడి
భగభగలు

- ఉక్కపోతతో జనాలు ఉక్కిరిబిక్కిరి
- నిర్మానుష్యంగా రహదారులు

4లో

సంక్షేమం, అభివృద్ధే
ప్రభుత్వ లక్ష్యం

- గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి

దీర్ఘకాలిక రోగులపై
దృష్టి పెట్టండి

- జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

6లో



సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

ఓపీ 442

- 113 మంది జ్వరపీడితులు
- సీతంపేట ఏరియా ఆసుపత్రి కిటకిట

సీతంపేట రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏరియా ఆసుపత్రి రోగులతో కిటకిటలాడింది. సోమవారం ఓపీ 442గా నమోదైంది. 19మంది మలేరియాతో, 94 మంది వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. కాగా వారిలో 49మంది ఇన్‌పేషెంట్లుగా ఆసుపత్రిలో చేరి వైద్యసేవలు పొందుతున్నారు. మిగిలిన వారు ఇతర ఆరోగ్య సమస్యలతో ఏరియా ఆసుపత్రికి వచ్చినట్లు సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. కాగా ఏజెన్సీలో ఏజెన్సీలో జ్వరాలు తగ్గుముఖం పట్టడం లేదు. మలేరియా, వైరల్ జ్వరా లతో గిరిజనులు వణుకుతున్నారు. వాతా వరణం మార్పుల కారణంగా అధిక సంఖ్యలో చిన్నారులు మంచం పడుతున్నారు. బొండి గ్రామానికి చెందిన శాత్విక్, అకిరానంద్ అనే చిన్నారులు చలి జ్వరంతో ఏరియా ఆసుపత్రిని ఆశ్రయించారు.

పీఎం జన్‌మాన్
పనులు పూర్తి చేయండి

- కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి నాయర్
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మాన్ పథకం కింద మంజూరైన పనులను సెప్టెంబరు 30 నాటికి పూర్తి చేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి విభూ నాయర్ తెలిపారు. 2026, మార్చి తర్వాత ఆయా పనులకు సంబంధించిన నిధులు అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఆది కర్మయోగి పథకం కింద వారంలో కనీసం రెండు సార్లు గ్రామాలను సందర్శించి అక్కడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఇందుకోసం సింగిల్ విండో విధానం అవలంబించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ.. 'పీఎం జన్‌మాన్ కింద మల్టీపర్పస్ కేంద్రాలను ఆగస్టుకు గృహ నిర్మాణాలను సెప్టెంబరు నాటికి పూర్తి చేస్తాం. మంజూరైన 19 రహదారుల నిర్మాణాలను 9 నెలల్లో పూర్తి చేస్తాం. జిల్లాకు మూడు వసతిగృహాలు మంజూరయ్యాయి. జలజీవన్ మిషన్ పనులకు టెండర్లు పిలిచాం. నవంబరు 15 నాటికి వాటి పనులు పూర్తి చేస్తాం. 'మన్యం'లో 190 మొబైల్ టవర్లకు గాను 137 నిర్మించాం. వాటికి అవసరమైన 11 రహదారులను కూడా మంజూరు చేశాం. గ్రామాల్లో వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రతి నెలలో నాలుగు నుంచి ఆరుసార్లు ఆయా ప్రాంతాలను వైద్యాధికారి సందర్శించి వైద్య సేవలు అందిస్తున్నారు.' అని తెలిపారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాత్సవ, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో నాల్కో గ్రీన్‌ఫీల్డ్ అల్యూమినియం పరిశ్రమ
ఏర్పాటు చేయండి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి రాష్ట్ర మంత్రి కొండపల్లి విజ్ఞప్తి

4లో

రంగంవలసలో
ఏనుగులు

- భీతిల్లుతున్న గిరిజనులు

4లో

విద్యార్థుల ఘర్షణ

- తోటి విద్యార్థులు చూస్తుండగానే ఘటన
- కుప్పకూలి మృతిచెందిన బాలుడు

బొబ్బిలి, జూలై 14(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో సోమవారం సాయంత్రం తొమ్మిదో తరగతి విద్యార్థి సుందరాడ కార్తికేయ (14)పై తోటి విద్యార్థి దాడి చేశాడు. కుప్పకూలిన బాలుడు కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయాడు. తోటి విద్యార్థుల సమక్షంలోనే ఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలి రావువారి వీధికి చెందిన కార్తికేయ, బొబ్బిలి మండలం ఓ గ్రామానికి చెందిన బాలుడు స్థానిక ప్రైవేట్ స్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. వీరిద్దరు ముందురోజు అమ్మాయి విషయమై గొడవ పడ్డారు. మాటామాటా పెరిగి ఒకరికొకరు సవాల్ విసురుకున్నారు. సోమవారం స్కూలు విడిచిపెట్టిన తరువాత 'కోటలోకి వస్తే నీ సంగతి చూస్తా ..' అంటూ కార్తికేయను ఇంకో విద్యార్థి హెచ్చరించాడు. అలాగే చూసుకుందాంలే అని కార్తికేయ బదులిచ్చాడు. అనుకున్న ప్రకారం సోమవారం సాయంత్రం బొబ్బిలి కోటలోకి ఇద్దరూ చేరుకుని తోటి విద్యార్థుల సమక్షంలో ఘర్షణ పడ్డారు. కార్తికేయపై ఆ బాలుడు పిడిగుద్దులతో దాడి చేశాడు. గమనించిన కోట ఉద్యోగులు వారిని మందలించి అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. విద్యార్థులంతా అక్కడ నుంచి వెళ్లి పోయారు. దాడికి గురైన కార్తికేయ కూడా పది అడుగుల దూరం నడుచుకుంటూ వెళ్లి నేలపై కుప్పకూలి పోయాడు. కోటలోని ఉద్యోగి తార్లాడ కిశోర్ మరికొంతమంది

(మిగతా 6వ పేజీలో...)



కలెక్టరేట్ వద్ద వినతిపత్రంతో కృష్ణ, యమునారాణి దంపతులు

సాంకేతిక లోపం.. వారికి శాపం

- 'తల్లికి వందనం' పథకానికి దూరం
- న్యాయం చేయాలని కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో తల్లిదండ్రుల వినతి
- విద్యాహక్కు చట్టం కింద ఉచిత ప్రవేశాలతో అవస్థలు

పార్వతీపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక లోపం కారణంగా జిల్లాలో ఎంతోమంది 'తల్లికి వందనం' పథకానికి నోచు కోలేదు. ప్రధానంగా విద్యాహక్కు చట్టం కింద లబ్ధి పొందిన కుటుంబాలు నగదు పొందలేకపోయాయి. వాస్తవంగా ఆయా కుటుంబా లకు చెందిన ఇద్దరు పిల్లల్లో ఒకరికి ప్రైవేట్ పాఠశాలల్లో ఫ్రీ సీటు రాక.. మరొకరికి ఫీజులు చెల్లించి చదివిస్తున్నారు. అయినప్పటికీ ఇద్దరు పిల్లలూ విద్యాహక్కు చట్టం కింద ఉచిత ప్రవేశాలు పొందినట్లు ఆన్‌లైన్‌లో నమోదైంది. దీంతో జిల్లాలో ఎంతోమంది 'తల్లికి వందనం' పథకానికి దూరమయ్యారు. విద్యాహక్కు చట్టం కింద మన్యంలో 528 మంది విద్యార్థులు ప్రవేశాలకు అర్హత పొందారు. అయితే వారిలో 424 మంది మాత్రమే వివిధ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు పొందారు. కాగా పార్వతీపురంలో బెలగాం ప్రాంతానికి చెందిన ఎ.చాందిని తన ఇద్దరు పిల్లలను ఒక ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నారు. మూడో తరగతి చదువుతున్న హర్షవర్ధన్‌కు విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలలో ఫ్రీ సీటు రాగా రెండో తరగతి చదువుతున్న జయవర్ధన్‌కు మాత్రం ఫీజు చెల్లిస్తున్నారు. అయినా 'తల్లికి వందనం' పథకం వర్తించలేదు. తన ఇద్దరు పిల్లల్లో గోవింద కృష్ణ విద్యాహక్కు చట్టం కింద ఓ ప్రైవేట్ పాఠశాలలో ఫ్రీ సీటు పొంది ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్నాడు. రెండో తరగతి చదువుతున్న

(మిగతా 8వ పేజీలో...)



'తల్లికి వందనం' పథకం వర్తింపజేయాలని డీఆర్వోను కోరుతున్న చాందిని

భానుడి భగభగలు

● ఉక్కపోతతో జనాలు ఉక్కిరిబిక్కిరి ● నిర్మానుష్యంగా రహదారులు ● కార్మికులకు తీవ్ర అవస్థలు



నిత్యం ఎక్కువ రద్దీగా ఉండే మూడులాంతర్లు వద్ద రోడ్డు ఇలా..



విజయనగరం: జిల్లా కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం రోడ్డులో ఇలా..



రాజాం రూరల్: నిర్మానుష్యంగా చీపురుపల్లి రోడ్డు

విజయనగరం/రాజాం రూరల్, జులై 14 (ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాంతో జిల్లా ప్రజానీకం అల్లాడిపోతున్నారు. గత నాలుగు రోజులుగా ఎండల తీవ్రత, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాత్రివేళలో కూడా వేడిగా ఉంటోంది. దీంతో చిన్నారులు, వృద్ధులు, బాలింతలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉపాధి, భవన నిర్మాణ కార్మికులు, ఫుట్‌పాత్ వర్తకులు ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు. శని, ఆదివారాల్లో వరుణుడు కరుణించినప్పటికీ వాతవరణంలో చల్లదనం కనిపించటం లేదు. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతుండటంతో రైతుకూలీలు ఎండలో పని చెయ్యాల్సిన పరిస్థితి నెలకొంది. కొంతమంది ఎండతీవ్రతను తట్టుకోలేక ఇంటికే పరిమితమవుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో సైతం ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు విద్యుత్ కోత సమస్య వేధిస్తోంది. దీని వల్ల ప్రజలకు మరిన్ని ఇక్కట్లు ఎదురవుతున్నాయి.

గడిచిన నాలుగు రోజులు ఉష్ణోగ్రతలు ఇలా..

● ఈనెల 11, 12 తేదీల్లో 34 డిగ్రీలు, ● 13న 36 డిగ్రీలు, ● 14న 33 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

● సోమవారం ఉదయం నుంచి సూర్యుడు చుర్రుమనిపించాడు. ఎండతీవ్రతతో పాటు, రాత్రి వరకు వేడి తగ్గలేదు. ఉక్కబోత కూడా ఎప్పటిలాగానే కొనసాగింది. వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయని.... వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నా... అందుకు భిన్నంగా పరిస్థితులు ఉంటున్నాయి.



విజయనగరం: పెద్దగా జన సంచారం లేని రాజాం మెయిన్‌రోడ్

రంగంవలసలో ఏనుగులు

● భీతిల్లుతున్న గిరిజనులు



రంగంవలస గ్రామ సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

సీతంపేట రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలోని గిరిశిఖర గ్రామం రంగంవలస సమీపంలో గజరాజులు సంచరిస్తున్నాయి. సోమవారం ఉదయానికి ఏనుగుల ఘీంకారాలు వినిపించాయని గ్రామస్థులు తెలిపారు. గడచిన రెండు రోజులు క్రితం కురుపాం మండల సరిహద్దులోని గుండం గ్రామంలో తిరుగాడిన ఏనుగులు అక్కడి నుండి వెనక్కి తిరిగి మళ్లీ సీతంపేట మండలంలోకి ప్రవేశించినట్లు అటవీశాఖ బీట్ అధికారి దాలినాయుడు చెప్పారు. ఏనుగులు సంచారాన్ని ఎలిఫెంట్ ట్రాకర్స్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఏనుగులు తిరుగుతున్న ప్రాంతంలోని గిరిజన గ్రామాలను అప్రమత్తం చేశామన్నారు. మరోపక్క ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించాలని గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బాసంగి వైపు గజరాజులు..

గరుగుబిల్లి, జూలై14 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంచరించిన ఏనుగుల గుంపు సోమవారం జియ్యమ్మవలస మండలం బాసంగి వైపు పయనమయ్యాయి. నాలుగు రోజులుగా మండలంలో సంచరించిన ఏనుగులు బాసంగి వైపు వెళ్లడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గిజబ, నందివానివలస, శివ్వాం, సీమలవానివలస గ్రామాల్లో పలు రకాల పంటలను నష్టం కలిగించాయి. మండలానికి ఆనుకుని ఉన్న బాసంగి వెళ్లినా తిరిగి వస్తాయన్న ఆందోళనలో ఉన్నారు. సంబంధిత సిబ్బంది గ్రామాల వైపు రాకుండా ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



గిజబ నుంచి బాసంగి వైపు వెళుతున్న గజరాజులు



తల్లిదండ్రులతో ఐతిహ్య

నృత్య పోటీల్లో ఐతిహ్య ప్రతిభ

పాలకొండ, జూలై14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఆదివారం జరిగిన 36వ జాతీయ స్థాయి నృత్యోత్సవం పోటీల్లో పాలకొండ పట్టణానికి చెందిన కొండదాడి ఐతిహ్య రెండో స్థానం సాధించింది. సబ్ జూనియర్ కేటగిరి విభాగంలో సుమారు 48 మంది చిన్నారులు పొల్గొనగా ఐతిహ్య రెండోస్థానం సాధించింది. ఈ సందర్భంగా చిన్నారి ఐతిహ్యను పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ ఫోన్ ద్వారా ప్రత్యేకంగా అభినందించారు. ఐతిహ్య తల్లిదండ్రులు పాలకొండ జనసేన నాయకులు కొండదాడి రాజేష్, అనురాధ ప్రోత్సాహాన్ని ఈ సందర్భంగా జయకృష్ణ మెచ్చుకున్నారు. మరిన్ని అవార్డులు సాధించి పాలకొండ పేరు నిలబెట్టాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

ఓడీఓపీ అవార్డును అందుకున్న కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కీర్తి పతాకం దేశ రాజధానిలో రెపరెపలాడింది. ఒన్ డిస్ట్రిక్ట్.. ఒన్ ప్రొడక్ట్ (ఓడీపీవో) అవార్డుకు బొబ్బిలి వీణ మొదటికి బహుమతి ఎంపికైంది. సోమవారం న్యూఢిల్లీలోని ప్రగతి మైదానంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఈ బహుమతిని అందుకున్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయెల్ దీనిని అందజేశారు. ఓడిఓపీ అవార్డుకు రాష్ట్రం నుంచి 7 జిల్లాలకు చెందిన ఉత్పత్తులు ఎంపికవ్వగా... బొబ్బిలి వీణకు ప్రథమ స్థానం దక్కడం విశేషం. ఈ కార్యక్రమంలో డిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఆ రాష్ట్ర మంత్రి జితిన్ ప్రసాద్, మన రాష్ట్ర మంత్రి సవిత తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలను పరిష్కరించండి

విజయనగరం క్రైం,జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 38 ఫిర్యాదులు స్వీకరించారు. భూ తగదాలకు సంబంధించి 8, కుటుంబ కలహాలకు సంబంధించి 1, మోసాలకు పాల్పడినట్లు 3, ఇతర అంశాలకు సంబంధించి 26 ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించి, సానుకూలంగా స్పందించాలని, చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదులను ఏడు రోజుల్లో పరిష్కరించి చర్యలు తీసుకోవాలన్నారు. తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు ఆర్‌వీఆర్‌కే చౌదరి, సుధాకర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరంలో నాల్కో గ్రీన్‌ఫీల్డ్ అల్యూమినియం పరిశ్రమను ఏర్పాటు చేయండి

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి మంత్రి కొండపల్లి విజ్ఞప్తి



న్యూఢిల్లీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో నాల్కో ఆధారిత గ్రీన్‌ఫీల్డ్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమను ఏర్పాటు చేయాలని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డికి రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తిచేశారు. సోమవారం, కేంద్ర మంత్రితో ఆయన కార్యాలయంలో భేటీ అయిన మంత్రి శ్రీనివాస్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రయోజనాలను వివరించారు. ఒడిశాలోని దమంజోడి నాల్కో అల్యూమినం రిఫైనరీకి విజయనగరం జిల్లా కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో, త్వరితగతిన చేరుకొనే రవాణా వ్యవస్థ అందుబాటులో ఉన్నందున అక్కడ పరిశ్రమను ఏర్పాటు చేయటం వల్ల తక్కువ ఖర్చుతో సమగ్ర పారిశ్రామిక వాతావరణాన్ని ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. ఈ స్మెల్టర్ పరిశ్రమ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన విజయనగరం జిల్లాలో భారీగా ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని, తద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుందని మంత్రి శ్రీనివాస్ అన్నారు.

రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా

● ఎఫ్‌సీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజ్‌గోపాల్



మాట్లాడుతున్న రాజ్‌గోపాల్

గజపతినగరం, జూలై 14: (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ కె.రాజ్‌గోపాల్ అన్నారు. సోమవారం స్థానిక రైతు సేవాకేంద్రంలో రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం సేకరణలో తమకు అన్యాయం జరుగుతోందని...ఒక్కో రైతు వద్ద 5 కిలోల వంతున తరుగుపేరుతో మిల్లర్లు కాజేస్తున్నట్లు రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గోనె సంచులు పూర్తి స్థాయిలో సరఫరా కావడం లేదని తెలిపారు. ఇచ్చిన వాటిలో అధికశాతం చిరిగిపోయినవే ఉంటున్నాయని వివరించారు. ధాన్యం తరుగు విషయంలో జేసీ పర్యవేక్షించాలని సూచించారు. గోనె సంచుల విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ డీఎం సునీల్ కుమార్, ఏజీఎం సర్కార్, పీఏసీఎస్ సీఈఓ నారాయణరావు, ఏఓ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

శృంగవరపుకోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకోవాలని మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, న్యాయాధికారి బీ.కనకలక్ష్మి అన్నారు. సోమవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో మధ్యవర్తిత్వం-దేశం కోసం అనే అంశంపె అవగాహన సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, చెక్ బౌన్స్ కుటుంబ, పరిష్కరించదగ్గ క్రిమినల్ కేసులను మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శి బీవీఎస్ రామారావు, ప్రభుత్వ సహాయ న్యాయవాది టీవీఆర్ మూర్తి, మీడియా సెక్రటరీ డబ్ల్యూఎన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఎస్.కోట: కోర్టులో న్యాయ అవగాహన సదసు నిర్వహిస్తున్న న్యాయాధికారి కనకలక్ష్మి

రాజాంలో..

రాజాం రూరల్, జులై 14 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకోవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ స్పష్టం చేశారు. ఇక్కడి కోర్టు సముదాయ ప్రాంగణంలో జూనియర్ న్యాయాధికారి నైమిషతో కలిసి సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శారదాంబ పాల్గొన్నారు. 90 రోజుల పాటు మధ్యవర్తిత్వంపై ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు జడ్జి ప్రకటించారు. ఇందుకోసం కోర్టు ప్రాంగణంలో ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. వివాహం, గృహహింస, చెక్‌బౌన్స్, రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని న్యాయాధికారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రోత్సహిస్తే గిరిజన కళకళ

● ఏజెన్సీలో ఎంతోమంది కళాకారులు ● సంప్రదాయ కళల్లో రాణింపు

● ప్రభుత్వ కార్యక్రమాలు, ఉత్సవాల్లో వారి పాత్ర కీలకం ● అయినా తగిన గుర్తింపునకు నోచని వైనం

● ఆసక్తి చూపని నేటితరం యువత ● ప్రభుత్వం స్పందించాలని విన్నపం





సాంస్కృతిక కార్యక్రమంలో గిరిజన కళాకారులు (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఎంతోమంది గిరిజన కళాకారులు ఉన్నారు. అయితే వారు తగిన గుర్తింపు, ప్రోత్సాహానికి నోచుకోవడం లేదు. దీంతో సంప్రదాయ కళలకు దూరమవుతున్నారు. నేటి తరం గిరిజన యువత కూడా వాటిపై ఆసక్తి చూపడం లేదు. పూర్వీకుల నుంచి ఆచార సంప్రదాయంగా వస్తున్న కళలను నమ్ముకుని అతికొద్దిమంది మాత్రమే ప్రస్తుతం జీవనం సాగిస్తున్నారు. ఇటువంటి కళాకారులను ప్రభుత్వం గుర్తించి.. గిరిజన కళలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదివాసీలు కోరుతున్నారు. లేకుంటే భవిష్యత్‌లో తమ కళలు కనుమరుగయ్యే అవకాశం ఉందని వారు వాపోతున్నారు. వాస్తవంగా పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో సవర జాతాపు, గదబ, కొండదొర తెగల గిరిజనులు ఉన్నారు. వారు నేటికీ సంప్రదాయ కళలు, ఆచారాలు, పండుగలు పాటిస్తారు. ప్రధానంగా డప్పు, తుడుము, సన్నాయి వాయిద్యాలు వాయించే గిరిజన కళాకారులు ఉన్నారు. వారి డప్పు వాయిద్యాలకు అనుకూలంగా గిరిజన మహిళలు థింసా నృత్యం చేస్తుంటారు. ఆగం, కందికొత్తల తదితర పండుగలు, పెళ్లిల్లోనూ వాయిద్యాలు వాయిస్తూ నృత్యాలు చేస్తుంటారు. అప్పుడప్పుడూ ప్రభుత్వ కార్యక్రమాలు, ఉత్సవాలకు వారు వెళ్తుంటారు. అయితే ఆ తర్వాత సమయాల్లో మాత్రం ఉపాధి కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇటువంటి కళాకారులను ట్రైబల్ రీసెర్చ్ మిషన్ ద్వారా గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. 60 ఏళ్లు దాటిన గిరిజన కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు. గిరిజన కళలు అంతరించపోకుండా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రోత్సహించాలి..

గిరిజన కళలను, కళాకారులు ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహించాలి. గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలి.

-తోయక నాగభూషణరావు, గిరిజన కళాకారుడు, ఉపాధ్యాయుడు, తాడికొండ

మ్యూజియం ఏర్పాటు చేయాలి..

గిరిజన కళాకారులను గుర్తించి.. ప్రోత్సహించాల్సి ఉంది. గుమ్మలక్ష్మీపురం కేంద్రంగా గిరిజనుల సాంస్కృతిక మ్యూజియం ఏర్పాటు చేయాలి.

-బిడ్డిక గోపాల్, గిరిజన సాంస్కృతిక సమితి, కన్నయ్యగూడ

సుపరిపాలన టీడీపీకే సాధ్యం

రాష్ట్రంలో సుపరిపాలన అందించగలిగేది టీడీపీ ఒక్కటేనని ఆ పార్టీ నేతలు అన్నారు. సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. భవిష్యత్తు ప్రణాళికలను తెలియజేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం



మెరకముడిదాం: కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు



జామి:కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి



భోగాపురంలో కర్రోతు బంగార్రాజు



చీపురుపల్లిలో రామ్మల్లిక్‌నాయుడు



నెల్లిమర్లలో సువ్వాడ రవిశేఖర్ తదితరులు

క్రైం న్యూస్

ఎయిర్‌పోర్టు కార్మికుడు మృతి

భోగాపురం, జూలై 14(ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపాలెం గ్రామ సమీపంలో ఎయిర్‌పోర్టులో పని చేస్తున్న జార్ఖండ్ రాష్ట్రం, బద్దారికి చెందిన చోటామంజి(35) చెట్టు కింద మృతి చెంది ఉన్నట్లు ఎస్‌ఐ వి.పాపారావు సోమవారం తెలిపారు. తోటి వ్యక్తుల సమాచారం ప్రకారం చోటామంజి కొంత కాలంగా ఎయిర్‌పోర్టులో కూలీగా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం మద్యం తాగి.. బైరెడ్డిపాలెం గ్రామ సమీప చెట్టుకింద సేద తీరేందుకు కూర్చున్నాడు. మధ్యాహ్న సమయంలో చెట్టు కింద మృతి చెంది ఉన్న చోటామంజిని స్థానికులు చూసి ఎయిర్‌పోర్టులో పని చేస్తున్న కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వి.పాపారావు తెలిపారు.

కొట్లాటపై కేసు నమోదు

భోగాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీ సుందరపేట సామాజిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో సోమవారం జరిగిన కొట్లాటపై బాధితురాలు పూసపాటిరేగ మండలం తొత్తడంకు చెందిన గొరుసు గాయత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పి.సూర్యకుమారి తెలిపారు. తొత్తడంకు చెందిన గొరుసు బంగారయ్యపై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దౌర్జన్యం చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం గొరుసు గోవింద అనే వ్యక్తి భోగాపురం పంచాయతీ సుందరపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి ఆసుపత్రిలో చేర్పించాడు. గొరుసు గాయిత్రి, గొరుసు శ్రీను ఆసుపత్రి బయట ఉన్నారు. ఇంతలో నీలాపు లావణ్య, నీలాపురాంనాయుడు, ఎస్.గౌరిరెడ్డి మరో 12 మంది మూకుమ్మడిగా వచ్చి గొరుసు గోవింద, గాయిత్రి, శ్రీనుపై దాడి చేశారు. 15 మందిపై గాయత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.సూర్యకుమారి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్కవరపుకోట, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎల్‌కేఎస్.పురం గ్రామానికి చెందిన తూర్పాటి లోకేష్ (36) చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మృతుడు లోకేష్ ఆదివారం మధ్యాహ్నం కోనమసివానిపాలెం గ్రామంలో జరిగిన ఫంక్షన్‌కి హాజరై తిరిగి స్వగ్రామం సీతారాంపురం వస్తుండగా జమ్మాదేవిపేట బంగ్లా సమీపంలో ఎస్.కోట నుంచి విశాఖ వైపు వస్తున్న కారు ఢీకొట్టినట్టు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లోకేష్‌ను ఎస్.కోట రీజనల్ ఆసుపత్రికి తరలించారని... అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారని చెప్పారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు.

వినతుల పరిష్కారంలో అలసత్వం వద్దు

విజయనగరం కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వినతుల పరిష్కారంలో అలసత్వం వద్దని జేసీ సేతుమాధవన్ అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 225 వినతులు వచ్చాయి. వీటిని జేసీ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాస్ మూర్తి, ప్రత్యేక ఉపకలెక్టర్లు మురళి, ప్రమీల గాంధీ, వెంకటేశ్వరరావులు స్వీకరించారు. భూ సమస్యలకు సంబంధించి 110 వినతులు, పంచాయితీరాజ్‌కు 10, పింఛన్లకు 25 వినతులు, మున్సిపాల్టీకి 7, విద్యాశాఖకు 7, మిగిలినవి ఇతర శాఖలకు సంబంధించినవి ఉన్నాయి.



వినతులు స్వీకరిస్తున్న జేసీ సేతు మాధవన్

న్యూస్ బాక్స్

నూతన కార్యవర్గం

రాజాం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాజాం పాస్టర్ ఫెలోషిప్ ఎన్నికలు సోమవారం ఏకగ్రీవంగా జరిగాయి. ఫెలోషిప్ అధ్యక్షుడిగా పాస్టర్ కె.ప్రసాద్. ఉపాధ్యక్షుడిగా ఎమ్ .యెహోషువా, కార్యదర్శిగా పీటర్, సహాయ కార్యదర్శిగా తేజేష్, కోశాధికారిగా షాలేమ్, సహాయ కోశాధికారిగా యేసేపు, గౌరవ అధ్యక్షులు, సలహాదారులుగా ఏంప రాజు, ప్రభుకుమార్. అంద్రూస్, జాన్ వసంత్‌కుమార్, ఏసుపాదం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

లయన్స్ క్లబ్..

చీపురుపల్లి, జులై 14 (ఆంధ్రజ్యోతి):చీపురుపల్లి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం జరిగాయి. క్లబ్ అధ్యక్షునిగా కోరాడ శంకరరావు, కార్యదర్శిగా సూరు కిరణ్, కోశాధికారిగా కందుల నాగశంకర్‌లు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా డి.సీతా రామరాజు, సూరు రామకృష్ణ, ఎస్వీ దుర్గారావు, కందుల పుండరి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రీజినల్ సమన్వయకర్త కె.వెంకటరావు, జడ్సీ యు.గోపాలరాజు, పూర్వపు జోనల్ సమన్వయకర్త ఎస్. సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

శృంగవరపుకోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణ పరిధిలోని ఎ.వి హోం, పందిరప్పన్న కూడలి, రామనగర్, పోలీస్ స్టేషన్ ప్రాంతం, రైల్వే స్టేషన్, సబ్ స్టేషన్ ప్రాంతంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సంబంధిత అధికారులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజాం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు ఈనెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ట్రేడ్లలో మిగిలిన ఖాళీ సీట్లు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాల కోసం 90000 96048, 83094 38446, 99595 02238 నెంబర్లుకు సంప్రదించాలని సూచించారు.

ముగిసిన వారోత్సవాలు

వేపాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో పశువైద్య శాఖ ఆధర్యంలో నిర్వహించిన పశుగ్రాస వారోత్సవాలు సోమవారంతో ముగిశాయని వేపాడ పశు వైద్యాధికారి కె.గాయత్రి తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా నల్లబిల్లి గ్రామంలో పాడి రైతులకు పశుగ్రాస పెంపకంపై అవగాహన కల్పించామన్నారు. ఉచిత వైద్య శిబిరంలో 32 పాడి పశువులకు చికిత్సలు అందించామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండపై పోలీసులకు ఫిర్యాదు

నెల్లిమర్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): నెల్లిమర మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుపై స్థానిక ఇందిరా కాలనీకి చెందిన జామి సంతోష్‌కుమార్ అనే దళితుడు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. పూతికపేట గ్రామంలో ఈ నెల 12న జరిగిన సభలో దళితులను కించపరిచే విధంగా మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రసంగించారని, ఆ వ్యాఖ్యలతో తాము తీవ్ర క్షోభకు గురయ్యామని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును భోగాపురం రూరల్ సీఐ రామకృష్ణకు, నెల్లిమర్ల పోలీసు స్టేషన్‌లో అందజేశారు. సీఐను కలిసిన వారిలో జామి సంతోష్‌కుమార్, మాత మురళీమోహన్, బోని భాస్కరరావు తదితరులు ఉన్నారు.

భోగాపురంలో...

భోగాపురం, జూలై14(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుపై ముంజేరు పంచాయతీ దానాలపేటకు చెందిన దానాల జగదీష్, భోగాపురం వాసులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు జనసేన మండల పార్టీ అధ్యక్షులు వందనాల రమణ తెలిపారు. దళితులపై మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ చేసిన వాఖ్యలకు క్షమాపణ చెప్పాలన్నారు. దీనిపై ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు.

మత్స్యకారులను ఆదుకోండి

రాజాం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకోవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నియోజకవర్గ మత్స్యకారుల సంఘ అధ్యక్షుడు బెహరా తవుడు వినతిపత్రం అందజేశారు. సోమవారం నిమ్మాడ గ్రామంలో కలిసి వివిధ సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. మైదాన చెరువుల లీజు ఆర్డర్ ఐదేళ్లకు ఇప్పించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ మైదాన చెరువుల విషయంలో ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బెహరా తవుడు

పోలీసుల తీరు దారుణం: ఎమ్మెల్సీ

శృంగవరపుకోట రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసుల తీరు దారుణంగా ఉందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. తనకు ప్రాణహాని ఉందనే ఉద్దేశంతో సెక్యూరిటీ ఏర్పాటు చేసుకున్నానని.. వారు ఉండడానికి తన స్థలంలో టెంటు వేసుకున్నానని తెలిపారు. టెంటు వేసిన వ్యక్తిని పోలీసులు భయభ్రాంతులకు గురిచేసి తీసుకుపోవడం బాధగా ఉందన్నారు. సోమవారం బొడ్డవరలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తనకు కొంతమంది నుంచి ప్రాణహాని ఉందని చెప్పారు. ఈ ప్రాంతంలో చాలామంది అనుమానస్పద వ్యక్తులు తిరుగుతున్నారని అన్నారు. స్థానిక పోలీసుల తీరును ఎస్పీకి వివరిస్తామని తెలిపారు. అనంతరం తన భార్య ఇందుకూరి సుధారాణితో కలిసి ఆయనే స్వయంగా టెంట్ తొలగించారు. ఈ విషయమై సీఐ నారాయణమూర్తిని వివరణ కోరగా... ప్రస్తుతం సెక్షన్ 30 ఉందని తెలిపారు. ఎవరు టెంట్లు వేసుకోవాలనుకున్నా ఎస్పీ నుంచి అనుమతి తెచ్చుకోవాలని స్పష్టం చేశారు.

23 నుంచి బ్యాడ్మింటన్ జట్టు ఎంపికలు

శృంగవరపుకోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23 నుంచి 25 వరకు జిల్లా బ్యాడ్మింటన్ జట్టు ఎంపికలను జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఛైర్మన్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. సోమమవారం శృంగవరపుకోట ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అవరణలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సీఈవో డాక్టర్ పొట్నూరు శ్రీరాములుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఎంపిక ప్రక్రియకు ఈనెల 20లోగా ప్రవేశ రుసం చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. పార్వతీపురం జి.తేజేశ్వరరావు (94405 05275), బొబ్బిలి కె.అపర్ణబాబు (79811 11705), సాలూరు ఎమ్‌డీ అబ్దుల్ (95157 29785), ఎస్.కోట డాక్టర్ పొట్నూరు శ్రీరాములు (79891 99534), కొత్తవలస వై.గణేష్ (90301 85690), విజయనగరం జి.శ్రీనివాసరావు (9133773485), చీపురుపల్లి కె.వేణుగోపాల్ (98669 33193)లను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా బ్యాడ్మింటన్ సహాయ కార్యదర్శి ఇందుకూరి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఫేకర్‌ను తెరిపించండి

గరివిడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గరివిడిలో మూతపడి ఉన్న ఫేకర్ పరిశ్రమను వెంటనే తెరిపించాలని సిటు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. గరివిడిలో 116 మంది కార్మికులు స్వతంత్ర సంఘాన్ని వీడి సీఐటీయు అనుబంధ సంఘంలో సోమవారం చేరారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షులుగా కె.విశ్వనాథరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.గౌరినాయుడు, ప్రధాన కార్యదర్శి సీహెచ్.విజయకృష్ణ, ఉపాధ్యక్షులుగా రామారావు, కూర్మారావులను ఎన్నుకున్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

సంతకవిటి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మిర్తివలస, మామిడిపల్లి గ్రామాలలో సోమవారం పార్యశుధ్య పనులను డిప్యూటీ ఎంపీడీఓ ఎన్.శ్రవణ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. వీధుల్లో చెత్త లేకుండా చర్యలు తీసుకొని, బ్లీచింగ్ వేశారు. మామిడిపల్లి, మిర్తివలస సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలని, సమయ పాలనను పాటించాలని సూచించారు.

పేదరికాన్ని రూపుమాపడమే పి-4 లక్ష్యం

విజయనగరం రింగురోడ్డు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికాన్ని రూపు మాపడమే లక్ష్యంగా ప్రభుత్వం పీ-4 విధానాన్ని రూపొందించిందని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అడ్మిన్, వేల్ఫేర్, ఎడ్యుకేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ, ఈ నెల 15 నుంచి డివిజన్ సభలు నిర్వహించాలని ఆదేశించారు. నగరంలో ఇప్పటికే 6,776 బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. సచివాలయ సిబ్బంది ద్వారా వార్డుల్లో మంగళవారం నుంచి 25లోగా డివిజన్ సభలు నిర్వహించి తుది జాబితాను తయారు చేయనున్నట్టు తెలిపారు. ఆగస్టు-15 నాటికి తుది జాబితాలో ఉన్న బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత చర్యలు తీసుకుంటామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు.



మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

ఓటర్ల జాబితా తయారీపై దృష్టి

విజయనగరం రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీపై రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని విజయనగరం నియోజకవర్గ ఏఈఆర్‌ఓ స్వర్ణకుమార్ చెప్పారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓ)లకు శిక్షణ కార్యక్రమం నగరంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించడం, వలస ఓటర్ల వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు దాసరి గాంధీ, పొందల శివశంకర్, మాస్టర్ ట్రైనీలు ఎస్.మధు, ఇంకుల వెంకటేష్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల దాడిలో యువకుడికి గాయాలు

డెంకాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ శ్రేణుల దాడిలో ఓయువకుడు గాయపడినట్టు దళిత సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. బాధితులు, సంఘాల నాయకుల కథనం మేరకు వివరాలివీ... డెంకాడ మండలం పేడాడ గ్రామానికి చెందిన సిమ్మల చిరంజీవి అనే దళిత యువకుడు జనసేన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటు న్నాడు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అనుచరుడిగా కొనసాగుతున్నాడు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దళితులపై ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యలపై సోమవారం డెంకాడ పోలీస్‌స్టేషన్‌లో కొంతమంది దళితులు రాత పూర్వకంగా ఎస్.ఐ. సన్యాసినాయుడుకు ఫిర్యాదు చేశారు. వీరిలో చిరంజీవి కూడా ఉన్నాడు. ఈ విషయాన్ని మనుసులో పెట్టుకుని సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో కొంతమంది వైసీపి శ్రేణులు చిరంజీవిని కులం పేరుతో దూషించి.. ట్రాక్టర్‌తో తొక్కించే ప్రయత్నం చేశారని.. అక్కడి నుంచి తప్పించుకుని చిరంజీవి ప్రాణాలు కాపాడుకున్నాడని స్థానిక దళిత సంఘ నాయకులు ఆరోపించారు. గాయపడిన చిరంజీవిని చికిత్స నిమిత్తం భోగాపురం మండలం సుందరపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



యువకుడి కాలిపై గాయం

అబద్ధాలతో గెలిచారు

గరివిడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికలలో కూటమి ప్రభుత్వంలో ఉన్న నాయకులు ప్రజలకు అమలు కాని హామీలతో, అబద్ధాలు చెప్పి గెలుపొందారని మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సీపీ నేత బొత్స సత్యనారాయణ అన్నారు. గరివిడిలో సోమవారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ గ్రామాలలో వైసీపీ నేతలు పర్యటిస్తూ ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-సర్టిఫికెట్ కోర్సులను వినియోగించుకోండి

విజయనగరం రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కళాశాలలో ప్రవేశపెట్టిన ఈ సర్టిఫికెట్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి కోరారు. జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ అనే అంశంపై ఆన్‌లైన్‌లో పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, మెకానికల్ లెర్నింగ్ అంశాలకు చాలా ప్రాముఖ్యత ఉందని చెప్పారు.

విలువలకు మారుపేరు అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయతీకి మారుపేరు, విలువలకు నిలువుటద్దమైన పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులు కావడం హర్షణీయమని డీసీసీబీ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున హర్షం వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా, ఎంపీగా కేంద్ర, రాష్ట్ర మంత్రిగా పనిచేసి విశేష సేవలు అందించిన అశోక్ గజపతిరాజుని గవర్నర్‌గా నియమించినందుకు ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నాగార్జున ధన్యవాదాలు తెలిపారు.

శృంగవరపుకోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజును గోవా గవర్నర్‌గా నియమించడం ఉత్తరాంధ్ర, తెలుగు ప్రజలకు దక్కిన గౌరవమని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బుచ్చి అప్పలరామప్రసాద్‌తో కలసి సోమవారం విజయనగరం కోటలో అశోక్ గజపతిరాజును కలసి శుభాకాంక్షలు తెలిపారు.

రాజాం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులవడంపై ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకొని పని చేసిన వారికి టీడీపీలో సముచిత స్థానం కల్పిస్తారనడానికి ఇది నిదర్శనమని అన్నారు.

భోగాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గోవా నూతన గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజును మార్క్ ఫెడ్ ఛైర్మన్, నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు సోమవారం విజయనగరంలో ఆయన బంగ్లాలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చీపురుపల్లి, జులై 14 (ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్ర గవర్నర్‌గా తెలుగుదేశం పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నాయకుడు పి.అశోక్‌గజపతి రాజు నియమితుడు కావడంపై ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు హర్షం వ్యక్తం చేశారు. నిజాయితీ పరుడు, సీనియర్ నాయకుడైన ఆయన గవర్నర్ పదవికి న్యాయం చేస్తారన్నారు. అశోక్‌కు గవర్నర్ పదవి రావడం పట్ల పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

గజపతినగరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు నియమితులవడం అభినందనీయమని మాజీ మంత్రి, జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిలా నుంచి మొట్టమొదటిసారిగా గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఆయనకు లభించడం గర్వకారణమన్నారు.

నెల్లిమర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజును పార్టీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. అశోక్ బంగ్లాలో ఆయనకు మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లకు రూ.30 వేల అపరాధ రుసుం

గజపతినగరం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై పోలీసులు దృష్టి పెట్టారు. 'ఇసుకను తోడేస్తున్నారు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 10 ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. సోమవారం తెల్లవారుజామున ఆర్ఐ అప్పలరాజు, వీఆర్వోలతో కలసి పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో సీతారామపురం గ్రామానికి చెందిన యిజ్జిరోతు గోవింద, ఎం.గుమడాం గ్రామానికి చెందిన ఆవాల రాము, పట్నాన తౌడుకు చెందిన ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేల వంతున అపరాధ రుసుం విధించినట్టు తహసీల్దార్ బి.రత్నకుమార్ తెలిపారు.

నిబంధనల మేరకు కాలువ నిర్మిస్తాం

రాజాం రూరల్, జులై 14 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు లోబడి కాలువ నిర్మాణం చేపడతామని... పాలకొండ రోడ్డులో ఓ ప్రయివేటు ఆసుపత్రి వద్ద అయిదు అడుగులు తగ్గించి... 75 అడుగుల మేర చేపట్టిన కాల్వ నిర్మాణాన్ని తొలగిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ నాగభూషణరావు స్పష్టం చేశారు. 'ఒంపు తిరిగిన కాలువ' శీర్షికన ఈనెల 12న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఇప్పటికే చేపట్టిన నిర్మాణాన్ని తొలగించి.... కొత్తగా మార్కింగ్ వేసి 80 అడుగుల మేర విస్తరణ పనులు చేపడతామని ఏఈ స్పష్టం చేశారు.

జిందాల్ నిర్వాసితులతో గ్రామసభలు నిర్వహించండి

శృంగవరపుకోట రూరల్, జులై 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎస్.కోట మండలంలో ఉన్న జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఈ పరిశ్రమలు నెలకొల్పుతామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తోందని.. వీటిపై గ్రామసభలు నిర్వహించి.. నిర్వాసితులకు స్పష్టత ఇవ్వాలని అధికారులను లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. సోమవారం జిందాల్ నిర్వాసిత గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు మట్లాడుతూ మొన్నటి వరకు తమ హక్కులో ఉన్న భూములు ఇప్పుడు వారివి అంటున్నారని ఆరోపించారు. అనంతరం బాబ్జీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుచేస్తే నిర్వాసితులకు ఆర్థిక భరోసాతో పాటు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. పీవోటీ భూముల విషయంపై పరిహారం ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు.

శాంతియుత ధర్నాలను అడ్డుకుంటారా?

రేగిడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బూరాడ సెంటర్-వంగర రహదారిలో ఉణుకూరు గ్రామం వద్ద దాదాపు 500 మీటర్ల మేర రోడ్డు పూర్తిగా పాడైంది. దీనిపై ఈనెల 6న సీపీఎం నిరసన తెలిపింది. ఈ నెల 14వ తేదీలోపు దీనికి మరమ్మతులు చేయకపోతే రోడ్డు ను దిగ్బంధిస్తామని సీపీఎం నేతలు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం ధర్నా చేసేందుకు వచ్చిన సీపీఎం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకరరావు, వీరికి మద్దతు పలికిన కొంతమంది గ్రామస్థులను స్థానిక పోలీసులు అడ్డుకున్నారు. పోలీస్ యాక్టు 30 పేరుతో శాంతియుత ధర్నాను అడ్డుకోవడం అత్యంత హేయమైన చర్య అని సీపీఎం నేతలు సూర్యనారాయణ, శంకరరావులు ఖండించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద కాసేపు నిరసన తెలిపారు. అక్కడే ఉన్న సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

హామీలు నిలుపుకోని ప్రభుత్వమిది

లక్కవరపుకోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నిలుపుకోలేదని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం గోల్డ్‌స్టార్ జంక్షన్‌లో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన వైసీపీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఏడాది కాలంలోనే ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, ఎడ్ల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలపై ప్రచారం

భోగాపురం, జూలై14 (ఆంధ్రజ్యోతి): భోగాపురం గ్రామానికి చెందిన శ్రీమారుతీ వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో వికలాంగులు రామిశెట్టి చిన్నారావు, బట్టా వెంకటరమణ పి-4 బంగారు కుటుంబాలు, సుపరిపాలనలో తొలిఅడుగుపై గ్రామాల్లో మూడు చక్రాల సైకిల్‌పై తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. పేద కుటుంబాలను దత్తత తీసుకొని వారు అభివృద్ధి చెందడమే లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందన్నారు.

శివారుకు అందేనా?

(3వ పేజీ తరువాయి)



నడిమికెల్ల ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న బ్రాంచి కాలువ

కుడి ఉప కాలువ పరిధిలో 11 బ్రాంచ్ కాలువల పనులు జరగాల్సి ఉంది. 267 వరకు ఆక్విడెక్టులు, సూపర్‌పాసేజ్‌లు, అండర్ టన్నెళ్లు, ఔట్‌లెట్లు, డ్రాపులు, యూటీ స్లూయిజ్‌లు, రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు వీలుగా వంతెనలు నిర్మించాల్సి ఉంది.

సిబ్బంది కొరత..

రెండు కాలువల పరిధిలోని సాగునీటి పర్యవేక్షణకు 42 మంది లస్కర్లు ఉండాలి. ప్రస్తుతం ఐదుగురే ఉన్నారు. గతంలో సీజనల్ లస్కర్లను నియమించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ విధానానికి మంగళం పాడేసింది. సిబ్బంది కొరత కారణంగా గండ్లు పడినా ఆయా ప్రాంతాల్లోని రైతులే స్వచ్ఛందంగా పూడ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

ప్రతిపాదనలు పంపించాం..

తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని రెండు కాలువల అభివృద్ధికి సుమారు రూ.1.40 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. ధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. లస్కర్ల కొరత ఉంది. సీజనల్ లస్కర్ల నియామకానికి ప్రతిపాదనలు పంపించాం. సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో రెండు కాలువల పరిధిలో పూడికతీతలు, పిచ్చి మొక్కలు తొలగింపు చేపట్టాం.

- వై.గనిరాజు, డీఈఈ, జలవనరులశాఖ, పాలకొండ సబ్ డివిజన్

నారుకు నీరేదీ?

(3వ పేజీ తరువాయి)

వర్షం కురవకుంటే పూర్తిగా నారు పాడయ్యే అవకాశం ఉందని అన్నదాతలు వాపోతున్నారు. సుమారు 6 వేల ఎకరాలకు పైగా వరి ఎదలు వేసిన వారు ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇక వీరఘట్టం మండలంలో కొందరు అన్నదాతలు సమీపంలో ఉన్న మోటార్ల ద్వారా నీటిని మళ్లించి నారుమడులు ఎండిపోకుండా చూసుకుంటున్నారు. వర్షాలు పడితేనే నారుమడులు దక్కుతాయని, లేకుంటే కష్టమేనని వారు వాపోతున్నారు.

సాంకేతిక లోపం.. వారికి శాపం

(3వ పేజీ తరువాయి)

దేవాన్షికి ఫీజు చెల్లిస్తున్నా.. 'తల్లికి వందనం' పథకం కింద నగదు జమకాలేదు. ఇక పార్వతీపురం పట్టణంలో వాసిరెడ్డి కృష్ణ, యమునారాణి దంపతుల ఇద్దరు పిల్లలు వి.మోక్షిత్‌నాయుడు, తనుశ్రీ ఒకే ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. వారికి ఫీజులు చెల్లిస్తున్నా.. మరో ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్యాహక్కు చట్టం కింద చదువుతున్నట్టు ఆన్‌లైన్‌లో నమోదైంది. దీంతో వారు కూడా 'తల్లికి వందనం' పథకానికి నోచుకోలేదు. తమకు న్యాయం చేయాలని సోమవారం వారంతా కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు వచ్చి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. సాంకేతిక తప్పిదాన్ని సరిచేసి పథకం వర్తింపజేయాలని విన్నవించారు. దీనిపై డీఈవో రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా.. అర్హులందరికీ 'తల్లికి వందనం' పథకం వర్తిస్తుందన్నారు. ఎక్కడైనా సాంకేతిక సమస్యలుంటే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

విద్యార్థుల ఘర్షణ

(3వ పేజీ తరువాయి)

పరుగున వచ్చి కొనఊపిరితో ఉన్న కార్తికేయను ఓ వాహనంలో హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే కార్తికేయ కన్నుమూశాడు. విద్యార్థి తండ్రి సంతోష్ బార్బర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి విజయ గృహిణి. అక్క చదువుకుంటోంది. బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ కటకం సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు కోటలోని ఘటనాస్థలాన్ని పరిశీలించాయి. నిందితునితో పాటు ప్రత్యక్ష సాక్షులుగా ఉన్న విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం కోసం కార్తికేయ మృతదేహాన్ని స్థానిక సీహెచ్‌సీలో ఉంచారు. హోంమంత్రి అనిత పోలీసులతో మాట్లాడి ఘటన కోసం తెలుసుకున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

బెలగాం, జూలై14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలను పరిష్కరించి మెరుగైన విద్య అందించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆర్టీసీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అనంతరం జేసీ శోభితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరుకలకు ఎస్టీ సర్టిఫికెట్ ఇవ్వాలి

బెలగాం, జూలై14 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలం తురకనాయుడువలసలో 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఎరుకల సామాజిక వర్గానికి ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎరుకల కులస్థులతో కలిసి నిరసన తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

సీతంపేట రూరల్, జూలై14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.గుమ్మడ సమీపంలో సోమవారం దోనుబాయి ఎస్ఐ మస్తాన్ దాడులు నిర్వహించారు. సారా వండుతున్న సాయికుమార్‌ను అరెస్టు చేశారు.

ప్రొటోకాల్ పాటించండి

సీతంపేట రూరల్, జూలై14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధుల పట్ల ప్రొటోకాల్ పాటించాలని అరకు ఎంపీ తనూజరాణి అన్నారు. సోమవారం సీతంపేటలో పర్యటించిన ఎంపీ స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో చాలా సమస్యలు ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సీతంపేట ఐటీడీఏలో పాలకవర్గ సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తొలుత స్థానిక సామాజిక భవనంలో వైసీపీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆమెతో పాటు మాజీ ఎమ్మెల్యే కళావతి, ఎంపీపీ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, సర్పంచ్ కళావతి ఉన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ నాగేశ్వరరావు మృతి

సాలూరు రూరల్, జూలై14 (ఆంధ్రజ్యోతి): సాలూరులో సీనియర్ జర్నలిస్ట్, ఏపీయూడబ్ల్యుజే నేత గర్భాపు నాగేశ్వరరావు సోమవారం గుండెపోటుతో మరణించారు. ఆయన 30 ఏళ్లుగా ఓ దినపత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. ఏపీయూడబ్ల్యుజేలో రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కొనసాగారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి

పాచిపెంట, జూలై14 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సోమవారం మండలంలోని కేసలిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కోసం వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొంతమంది సర్పంచ్‌లు అభివృద్ధికి సహకరించడం లేదని, అవసరమైతే గ్రామసభలు నిర్వహించి తీర్మానంలో ప్రజలు సంతకాలు చేసినట్టయితే రహదారులతో పాటు మిగిలిన అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ప్రతిపక్ష నాయకుల దుష్ప్రచారం చేస్తున్నా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గూడేపు యుగంధర్, సాలూరు ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, నాయకులు పల్లేడ ఉమామహేశ్వరరావు, కొత్తల పోలినాయుడు, పిన్నింటి ఈశ్వరరావు, చల్లా కనకబాబు, భాస్కరరావు, సాయి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు ఆసరా

● సాలూరు, జూలై14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఆసరాగా నిలుస్తోందని మహిళా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆమె సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. సాలూరు మండలంలోని కందులదం గ్రామానికి చెందిన కొల్లి సావిత్రికి రూ.2.81 లక్షలు, పట్టణంలోని 22వ వార్డుకు చెందిన టేకి భారతికి రూ.61,572, మెంటాడ మండలం లక్ష్మీపురానికి చెందిన దేవర త్రినాథకు రూ.1.10 లక్షల చెక్కును ఆమె అందజేశారు. అనంతరం మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముందుంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేషు, మరిపి సింహాచలం, మత్స శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి సంధ్యారాణి

సంతృప్తి చెందేలా వినతుల పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పార్వతీపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులపై అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జేసీ ఎస్.ఎస్.శోభిక, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో హేమలతలతో కలిసి ప్రజల నుంచి 160 వినతులను కలెక్టర్ స్వీకరించారు.

మాకు తెలియకుండా భూమి అమ్మేశారు..

●పార్వతీపురం, జూలై14 (ఆంధ్రజ్యోతి): తమ ప్రమేయం లేకుండా భూములను విక్రయించేశారని భామిని మండలం బాలేరు గ్రామానికి చెందిన ఆర్.విజయలక్ష్మి, దివ్యాంగులైన తన పిల్లలతో కలిసి పీజీఆర్ఎస్‌కు సోమవారం ఫిర్యాదు చేసింది. తన భర్త ఆర్.రామానందం అనారోగ్యం కారణంగా 2024 ఫిబ్రవరి 10న మృతి చెందారని తెలిపింది. రామానందంకు ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారన్నారు. సర్వే నెంబరు 352/7లో ఎకరా పది సెంట్ల భూమిపై ముగ్గురు అన్నదమ్ములకు సమానంగా హక్కు ఉందన్నారు. అయితే రామానందం మృతిచెందడంతో ఆ భూమిని ఇద్దరు సోదరులు వేరొకరికి విక్రయిం చేశారన్నారు. న్యాయం చేయాలని అడిగితే దౌర్జన్యం చేస్తున్నారని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ఆమె వినతిపత్రాన్ని అందించారు.

బాధితులకు న్యాయం చేయండి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ

బెలగాం, జూలై14 (ఆంధ్రజ్యోతి) : అలసత్వం చూపకుండా సత్వరమే ఫిర్యాదులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం పోలీస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 13 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ ఆదాం పాల్గొన్నారు.

పోలీసులకు ఉచిత వైద్య శిబిరం

●బెలగాం, జూలై14 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ మెగా వైద్య శిబిరం నిర్వహించినట్టు ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ సిబ్బందికి విజయనగరం, శ్రీకాకుళం మెడికోవర్ ఆసుపత్రి సౌజన్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ పోలీసులు అహర్నిశలు విధి నిర్వహణలో ఉండడంతో ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని, వారి ఆరోగ్య పరిరక్షణకు వైద్య శిబిరం నిర్వహించామన్నారు. హోమోగ్రాం, డయాబెటిస్, కిడ్నీ, లివర్, కార్డియాక్ తదితర వాటికి సంబంధించిన పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డా.మల్లికార్జునరావు, అఖిల్, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు



ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేస్తున్న జేసీ

పార్వతీపురం, జూలై14 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం కలెక్టరేట్‌లో సోమవారం దివ్యాంగులకు జేసీ ఎస్.ఎస్.శోభిక ఉపకరణాలను పంపిణీ చేశారు. పాలకొండలోని కొండవీధికి చెందిన జమ్మన తేజశ్రీ, సీతానగరం మండలం వెంకటాపురానికి చెందిన కట్టమూరి కార్తీక్‌లకు ల్యాప్‌టాప్‌లు, కొమరాడ మండలం ఆర్తం గ్రామానికి చెందిన వడ్లమాని ప్రసాదరావుకు చెవిటి మిషన్ అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో కె.హేమలత, డీఆర్డీఏ పీడీ ఎం.సుధారాణి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ప్రతినిధి రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

సాలూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టవలస పాఠశాల విద్యార్థులకు మండల కో-ఆప్షన్ సభ్యుడు, బేతేలు సోషల్ ఆర్గనేషన్ అధ్యక్షుడు గుడివాడ సూర్యనారాయణ సోమవారం విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో విజయమ్మ, ఎలిశా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్లు భర్తీకి రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ఈనెల 18 నుంచి 20 వరకు చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌ను 22లోగా చేయించుకోవాలని పేర్కొన్నారు.

కూటమితోనే స్వర్ణాంధ్ర సాధ్యం



తొలి అడుగులో ఎమ్మెల్యే జగదీశ్వరి

జియ్యమ్మవలస, జూలై14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం అలమండ పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షుడు జోగి భుజంగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్, వట్టిగెడ్డ రిజర్వాయర్ చైర్మన్ ఎం.సత్యంనాయుడు, లంక గోపాలం తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రోగులపై దృష్టిపెట్టండి



సూచనలిస్తున్న ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి

సీతానగరం, జూలై14 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం మెరుగుకు కృషి చేయాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. శనివారం నిడగల్లు గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే రోగులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు, చికిత్స వివరాల రికార్డుల పరిశీలించారు. 104 వాహనంలో ఈసీజీ పరికరం పనితీరు, మందుల లభ్యతపై అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయాలన్నారు. అనంతరం సంచార చికిత్స కార్యక్రమానికి వచ్చిన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమ్య, సూపర్‌వైజర్ గోపాలరావు, సీహెచ్‌వో ధరణి, 104 సిబ్బంది, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

పాఠశాల కోసం తల్లిదండ్రులు పట్టు

● చదువులకు దూరంగా 48 మంది విద్యార్థులు



పాఠశాలకు వెళ్లని విద్యార్థులు వీరే

గరుగుబిల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిక్కింవలసలో మోడల్ ప్రైమరీ పాఠశాల గుర్తింపు కోసం తల్లిదండ్రులు పట్టువీడటం లేదు. పాఠశాలకు పిల్లలను పంపించడంలేదు. దాంతో 48 మంది విద్యార్థులు చదువుకు దూరంగా ఉన్నారు. ఇక్కడ కూరాకుల కులానికి చెందిన విద్యార్థులే అధికంగా ఉన్నారు. గతంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు గ్రామానికి ఆనుకుని పాఠశాల ఉండేది. ప్రస్తుతం 1, 2 తరగతులకు మాత్రమే పరిమితమైంది. 3, 4, 5 తరగతులకు సంబంధించి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న పాఠశాలకు పంపించేందుకు తల్లిదండ్రులు ససేమిరా అంటున్నారు. గ్రామంలో సుమారు 48 మందికి పైగా విద్యార్థులు ఉన్నా పాఠశాల గుర్తింపునకు అధికారులు దృష్టి సారించడం లేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను మన్యం కలెక్టర్, కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి దృష్టికి తీసుకువెళ్లామని గ్రామానికి చెందిన పాతిన పోలీస్, తిరుపతిరావుతో పాటు ఎస్ఎంసీ చైర్మన్ కె.భవాని తదితరులు తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

పక్షోత్సవాలను విజయవంతం చేయండి

సీతానగరం, జూలై14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీ పాలకవర్గాలు నిర్వహించనున్న పారిశుధ్య పక్షోత్సవాలను విజయవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి నాగభూషణరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 15 నుంచి 31 వరకు గ్రామాల్లో నిర్వహించనున్న పారిశుధ్య పక్షోత్సవాలపై డిప్యూటీ ఎంపీడీవో కె.కుమారవర్మ అధ్యక్షతన సోమవారం అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి భాగస్వామ్యం అవసరం

సీతానగరం, జూలై14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతోనే విద్యాభివృద్ధి సాధ్యపడుతుందని డీఈవో బి.రాజ్‌కుమార్, జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆర్.తేజేశ్వరరావు అన్నారు. సోమవారం కోర్స్ డైరెక్టర్ ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో మరిపివలస షిరిడిసాయి పాలిటెక్నికల్ కళాశాలలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు, పేరెంట్స్ భాగస్వామ్యంపై జిల్లాస్థాయి తొలివిడత ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి చేపట్టవలసిన అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తామన్నారు. 15 మండలాల నుంచి మొదటి విడత శిక్షణకు 250 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో-1 జి.సూరిదేముడు, మోనటరింగ్ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 95 వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న పీవో

సీతంపేట రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి 95 వినతులను స్వీకరించారు. కుంబి గ్రామంలో బోర్‌వెల్ మంజూరు చేయాలని బి.అనంత్ కోరారు. మెళియాపుట్టి మండలం బరణికోట నుండి కొండగాం వరకు రహదారి మంజూరు చేయాలని ఎస్ ఉమాశంకర్ వినతిపత్రం అందజేశారు. కిల్లాడలో వరదగోడ నిర్మించాలని ఆరిక ఆనందరావు, తన భూమికి చెందిన 1బి, అడంగల్ కాపీ ఇప్పించాలని సవర సుందరన్న కోరారు కార్యక్రమంలో డీడీ అన్నదొర, పీహెచ్‌వో ఆర్‌వీ గణేష్, డిప్యూటీ ఈవో రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు సిద్ధం



నిరసన తెలుపుతున్న కార్మికులు

పార్వతీపురం టౌన్, జూలై14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గతంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఉద్యమాలకు సిద్ధమని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు జీవీ రమణ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 17 రోజుల సమ్మె చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 62 ఏళ్ల వరకు ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమానికి విశాఖ వెళ్లి విధులు నిర్వహించిన కార్మికులు ఇప్పటికీ భత్యాలు నేటికి చెల్లింకపోవడం దురదృష్టకరమన్నారు.

దోమల నివారణకు స్ప్రేయింగ్

కురుపాం, జూలై14 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణలో భాగంగా మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని గౌడ వీధి, గాంధీ నగర్, నెయ్యల వీధి తదితర ప్రాంతాల్లో ఐఆర్ఎస్ ఏసీఎం స్ప్రేయింగ్ నిర్వహించారు. రావాడ, రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చీకంటి శంకరరావు పనులను పర్యవేక్షించారు.పరిశీలించారు. మలేరిమా నిర్మూలనలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న స్ప్రేయింగ్‌కు ప్రజలు సహకరించి ఇళ్లల్లో స్ప్రేయింగ్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురుపాం ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, పంచాయతీ ఈఓ కె.సురేష్,సూపర్వైజర్ కె.రాధకృష్ణ, ఎంటీఎస్ రాజశేఖర్,ఎంఎల్‌హెచ్‌పీ యు.ప్రత్యూష, ఏఎన్ఎంలు పద్మ, నిర్మల, ఆశవర్కర్లు, సీహెచ్‌డబ్ల్యూవోలు పాల్గొన్నారు.

పెదవంగరలో 'నవోదయం'

పాలకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలం పెదవంగరలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పాలకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.సూర్యకుమారి కార్యక్రమంలో పాల్గొన్నారు. సారారహిత గ్రామంగా పెదవంగరను తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే డీటీగా మారుతీరావు

గరుగుబిల్లి, జూలై14 (ఆంధ్రజ్యోతి): రీసర్వే ఉప తహసీల్దార్‌గా ఎస్.మారుతీరావు బాధ్యతలు స్వీకరించారు. పాలకొండలో విధులు నిర్వహిస్తూ ఇన్‌చార్జిగా మండలానికి నియమితులయ్యారు. గ్రామాల్లో రీసర్వేకు సంబంధించి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తానన్నారు. రీసర్వేతో పాటు పౌర సరఫరాల శాఖ డీటీగానూ విధులు నిర్వహించాల్సి ఉందన్నారు.

సెంటర్ లైటింగ్ పనుల ప్రారంభం



పనులు జరుగుతున్న దృశ్యం

వీరఘట్టం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మేజర్ పంచాయతీ ప్రధాన రహదారి సెంటర్ లైటింగ్ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందుకుగానూ శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ కొరికాన రవికుమార్ రూ.50 లక్షలు నిధులు విడుదల చేశారు. సెంటర్ లైటింగ్ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రెండో రోజూ కార్మికుల నిరసన



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

పాలకొండ, జూలై14 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట రెండో రోజు సోమవారం ఇంజనీరింగ్ కార్మికులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని పాలకులు చెప్పినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. గత 17 రోజులుగా సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు, జీవోలు ఇవ్వాల ని, అమలు సంబంధిత మంత్రి కార్మిక సంఘాలతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి సమ్మె విరమించేలా చూడాలన్నారు. నిరసనలో వై.హరిబాబు, వై.సురేష్, ఎస్.బాబూరావు, పి.రమేష్, ఐ.రాజు, కె.రాజేష్, నరసింగరావు, పి.సాయి తదితరులున్నారు.